క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం

కొల్లిపర: ప్రభుత్వం గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్(ఇంటికే పోషకాహార కిట్) పంపిణీ కార్యక్రమం తెనాలి ఐసిడిసి ప్రాజెక్టు పరిధిలో కొల్లిపర మండల స్థాయిలో బుధవారం మండల పరిత్ కార్యాలయం మీటింగ్ హాల్ ఆవరణలో ఉదయం 11గంటలకు ప్రారంభిస్తున్నట్లు సీడీపీఓ ఎం.సునీత తెలిపారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు ఇక నుంచి ప్రతి నెల 1వ, 3వ శుక్రవారంలో రెండు సార్లుగా కార్యక్రమాన్ని నిర్వహించి మొదటి విడతగా గర్భిణి, బాలింతలకు 3 కేజీలు బియ్యం, 1కేజీ కందిపప్పు, అరకిలో పామాయిల్, 13 కోడిగ్రుడ్లు, 2.5లీటర్ల పాలు, వైఎస్సార్ కిట్ ద్వారా రాగిపిండి 2కేజీలు, అటుకులు 1కేజీ, అరకిలో బెల్లం, ఖర్జూరాలు, వేరుశనగ చిక్కీలు పంపిణీ చేస్తారని, రెండువ విడతలో 12కోడిగ్రుడ్లు, 2.5లీటర్లపాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ పాల్గొంటారని తెలిపారు. కావున మండలంలోని ప్రతి గర్భిణి, బాలింతలు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలరని కోరారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ వై.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, గాంధీనగర్‌లో షిరిడిసాయి ఆశ్రమంలోని వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగసేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు వెలివెల శివరామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి ,యోగసభ్యులు సామ్రాజ్యం, గంగమ్మ, ఈశ్వరరావు, పలువురు యోగాసాధకులు పాల్గొన్నారు. ఎస్వీ యోగసభ్యులు చందు రాజగోపాల్, లీలాకుమారిల మనుమడు అగస్త్యనందన్ నాలుగో పుట్టిన రోజు వేడుకలు ఆశ్రమాల్లో నిర్వహించారు. దిలి హాస్పటల్ వారి సౌజన్యంతో ఉదయబాస్కర్ అర్చనరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమల్లో పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కన్వీనర్ రమణయ్య, కుర్రా శ్రీనివాసరావు, అనూష, యోగసాధకులు పాల్గొన్నారు.

తెనాలిలో సినీహీరో సాయిధరమ్ తేజ్



తెనాలి: సినీ హీరో సాయిధరమ్ తేజ్ తెనాలిలో సందడి చేశారు. ఆయన నటించిన ‘బ్రో’ సినిమా ప్రమోషనులో భాగంగా దర్శకుడు సముద్రఖనితో కలిసి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆ చిత్రం ప్రదర్శిస్తున్న సంగమేశ్వర థియేటరుకు వచ్చారు. ఈ విషయం తెలిసిన అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటరుకు చేరుకున్నారు. థియేటరు యాజమాన్యం, అభిమానులు సాయిధరమ్ తేజ్‌ను భారీ గజమాలతో సత్కరించారు. వారి నుద్దేశించి మాట్లాడుతూ తెనాలి రావటం, అభిమానులను కలుసుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. సినిమా ఎలా ఉందని ప్రేక్షకులను ప్రశ్నించి తెలుసుకున్నారు. అందరూ జాగ్రత్తగా ఇళ్లకు వెళ్లాలని, బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచనలు చేశారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్, తాడేపల్లి మెయిన్ రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసి పైపులైను నుంచి తాగునీరు లీక్ కావడంతో మంగళవారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా వేసిన పైప్‌లైన్ జాయింట్ ఊడిపోవడంతో తాగునీరు భారీగా డ్రెయిన్ కలుస్తోంది. సమాచారం అందుకున్న ఇంజినీరింగ్ సిబ్బంది తాగునీటి సరఫరాను నిలిపివేశారు. డోలాస్‌నగర్‌లో భారీ వాహనాలు వెళ్లడంతో భూమి లోపల ఉన్న పైప్‌లైన్ దెబ్బతిని లీకేజ్ ఏర్పడడంతో అక్కడ కూడా తాగునీటి సరఫరాను నిలిపివేసి 2 గంటల వ్యవధిలో ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు నిర్వహించి తాగునీటిని పునరుద్ధరించారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురైతే సంబంధిత సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బంది కోరారు.

జగనన్నతోనే జనరంజక పాలన

ఎమ్మెల్యే శివకుమార్



లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కొల్లిపర గ్రామంలో సచివాలయం 2 పరిధిలోని విజయ టాకీస్ వద్ద నుంచి బీసీ కాలనీ వరకు జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని 230 ఇళ్లను సందర్శించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన సమయంలో ఆకుటుంబం మూడేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే వివరించి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. ఈ మూడేళ్లలో ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి ఇంట్లో ఉన్న వారికి చెబుతూ వైసీపీ ప్రభుత్వాన్ని మరల అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో నియోజక వర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధికి బాటలు వేసినట్లు వివరించారు. ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువచేసి గ్రామంలోనే సచివాలయం ద్వారా అన్ని సేవలందించడం జరుగుతుందన్నారు. సచివాలయం 2 పరిధిలో సుమారు 6వేల లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో రూ.22.46 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి కొరకు రూ. 68 లక్షలు ఖర్చుచేసినట్లు తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు గ్రామంలో ఇంకా అర్హత ఉంది వివిధ సాంకేతిక లోపాలు వల్ల ఇంకా రానివారికి తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను వెంటనే పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు కారణంగా డ్రైనేజీలో నీరు నిల్వ ఉంది మురుగు సమస్యలు అధికంగా ఉన్నాయి అని తెలిపారు. వెంటనే ఆయన పంచాయతీ కార్యదర్శికి డ్రైనేజీ సమస్యలు ఉన్న చోట మురుగు నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక , ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి,పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, చెంచల రామిరెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, ఝాన్సీ, నాలాది బుజ్జిబాబు, ఉన్నం నాని, మల్లోల కమలకుమారి, పోకూరి విజయ్, దూరు బుల్లిబాబు, ఎంపీడీఓ చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీరులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రముఖ బిల్డర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు భౌతికకాయానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ బిల్డర్, ఏఆర్‌పి కన్‌స్ట్రక్షన్స్ అధినేత అడుసుమల్లి వెంకటేశ్వరరావు (55) మృతిచెందారు. మూడునెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వరరావు గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుది శ్వాస విడిచారు. అయనకి భార్య ఉన్నారు. తెనాలిలోని తల్లీపిల్లల వైద్యశాల, తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్, కూరగాయల మార్కెట్ సముదాయం, నరసరావుపేటలోని వైద్యశాల భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం సిరిపురం జగనన్న కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్లలో ఒకరు. బుర్రిపాలెం రోడ్డులోని నివాసం వద్ద ఉంచిన వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని మంగళవారం తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పలువురు రాజకీయ పార్టీల నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంకటేశ్వరరావుకు నివాళి అర్పించినవారిలో ఉన్నారు.

తల్లిపాలతో పిల్లలకు బహుళ ప్రయోజనాలు



కరపత్రాన్ని ఆవిష్కరించిన చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్, తెనాలి శాఖ, హ్యాపీ హాస్పటల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ‘తల్లిపాలతో కలిగే ఉపయోగాలు’ అనే అంశంపై రూపొందించిన కరపత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఆవిష్కరించారు. తల్లిపాల ఆవశ్యకతను ప్రతిఒకరూ గుర్తించాలని చెప్పారు. అందుకే ఏటా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలతో పిల్లలకు కలిగే ప్రయోజనాలను వైద్యులు వివరించారు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హ్యాపీ హాస్పటల్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పావని ప్రియాంకలు తల్లీపిల్లల యూనిట్‌కు 12 కుర్చీలను బహూకరించారు. తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి బాలింతలకు రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ మహేష్‌కిరణ్, డాక్టర్ రామాంజనేయులు, డిప్యూటీ పీఎంఓ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ శైలజ, డాక్టర్ మసీద, డాక్టర్ పవని, రెడ్‌క్రాస్, జేఎంజే కాలేజి యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

13న చిత్రలేఖనం పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న తాడేపల్లి బాలోత్సవం నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వివిధ పాఠశాలల్లో తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు బాలోత్సవం నిర్వాహకులు అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని బాలోత్సవం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల్లో సీనియర్స్ విభాగం 8,9,10 తరగతులు, జూనియర్ విభాగం 6,7 తరగతులు, సబ్ జూనియర్స్ 3,4,5 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జెండా వందనం, స్వాతంత్ర్య సమరయోధులు, దేశమును ప్రేమించుమన్న చరణాలపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం రెండు నుంచి నాలుగు గంటల వరకు తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని సీఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపాన గల అమరావతి ఐకాన్ అపార్ట్‌మెంట్ ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు ఈ నెల 10వ తేదీలోపు 9490099559 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇవ్వబడుతుందని, మిగిలిన మెటీరియల్ చిత్రకారులే తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. సమాజంలో ఇంగ్లీషు భాష ఆవశ్యకత పెరిగిందని, మాతృభాషతోపాటు ఆంగ్లంపై కూడా పట్టు సాధించడం అవసరమనే ఉద్దేశంతో ఆంగ్లం నేర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, సింపుల్ ఇంగ్లీష్ తదితర అంశాలపై బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ మేనేజర్ పి.రాజు ఆంగ్ల భాషపై శిక్షణ ఇస్తారని వివరించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి లక్ష్యసాధన, నాయకత్వ లక్షణాలు, టీమ్ అభివృద్ధి, ప్లానింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా ఈ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కరపత్రాలను తాడేపల్లి పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8790854540, 9246466114, 9848021115 నెంబర్లను సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో బాలోత్సం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆవులను రోడ్లపైకి వదిలితే భారీ జరిమానా

మంగళగిరి: ఆవులు, పందులు, కుక్కలను నగరంలో రోడ్లపైకి వదిలితే భారీ జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ యు శారదాదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆవులు, పందులు, కుక్కలను యజమానులు బహిరంగంగా వదులుతుండటంతో రోడ్లపై ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా జంతువులను రోడ్లపైకి వదిలితే రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి

తాడేపల్లిరూరల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఏపీ జానపద వృత్తి కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు ఆకురాతి జగన్ అన్నారు. మంగళవారం కుంచనపల్లి అంబేడ్కర్ సెంటర్ వద్ద మణిపూర్ ఘటనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంతో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. బీజేపీ ప్రోద్బలంతోనే మైతేయ్‌లు మారణహోమం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కళాకారులు , స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: కొల్లిపర మండల కేంద్రమైన కొల్లిపర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో స్థానిక (వీరభద్ర కాలనీ) బీసీ కాలనీలో 33 కేవీ విద్యుత్ లైన్ వర్క్ బుధవారం జరుగుతుందని ఏఈ పి.ప్రదీప్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లిపర, అత్తోట, దంతలూరు, కుంచవరం, కమతవారిపాలెం, చివలూరు సుమారు 6గంటల వరకు ఉదయం నుంచి సాయంత్రం 6గంటల సమయం లోపు విద్యుత్ సరఫరా కు అంతరాయం జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ లైన్ వర్క్ కు సహకరించాలని కోరారు. విద్యుత్ ఉన్న సమయంలో వినియోగ దారులు వారి పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

నేడు సంపూర్ణ పోషణ కిట్ పంపిణీ

తెనాలిటౌన్: కొత్తపేటలోని ఎన్‌జీఓ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ ఎం.సునీత మంగళవారం తెలిపారు. శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఖాలీనా నసీమా , ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతిలు పాల్గొంటారని తెలిపారు. బాలింతలు , గర్భిణులు తప్పని సరిగా హాజరు కావాలని సిడిపిఓ సునీత కోరారు.

రేపు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి కౌన్సెలింగ్

తెనాలి: ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో ఆగస్టు–2023 విద్యాసంవత్సరం రెండో విడత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపల్/ జిల్లా కన్వీనర్ రావి చిన్నవెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో మొత్తం 276 సీట్లకు గాను కేవలం 70 సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు తెలిపారు. మిగిలిన 206 సీట్లను 300 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు అందరికీ సీట్లు వచ్చే అవకాశం ఉన్నందున 3న జరిగే కౌన్సెలింగ్‌కు రావాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మొత్తం 1368 సీట్లకు కేవలం వంద సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు చెప్పారు. మిగిలిన 1268 సీట్లకు 1025 దరఖాస్తులు మాత్రమే వచ్చాయనీ, అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న ఐటీఐల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

6న మహమ్మద్ రఫీ సంగీత విభావరి

తెనాలి: ప్రముఖ గాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా ఈనెల 6వ తేదీన ‘రఫీ సాబ్ కె గానే’ సంగీత విభావరిని నిర్వహించనున్నారు. ఇక్కడి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో డాక్టర్ కె.పురుషోత్తమరావు ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి 9 గంటల వరకు జరిగే విభావరిలో ఆయనతోపాటు షేక్ బి.సైదా, పీఎల్ ఆలీఖాన్, షేక్ ఖాజా షానవాజ్, పి.శివలీల, ఎం.మల్లికలు రఫీ గీతాలను గానం చేస్తారు. రఫీ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి రజక చెరువు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1.08 లక్షలు నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను టూ టౌన్ పోలీసులకు అప్పగించారు.

స్వల్ప విషయమై దాడి

తెనాలిరూరల్: స్వల్ప విషయమై జరిగిన దాడిలో ముగ్గురు గాయపడారు. తెనాలి నందులపేట కవిరాజాపార్కు రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌కు సోమవారం రాత్రి సిమెంటు లోడుతో ఆటో వచ్చింది. అపార్ట్‌మెంట్ వద్ద ద్విచక్రవాహనానికి ఆటో తగలడంతో వాహనం నడుపుతున్న బాలుడికి, ఆటో డ్రైవర్‌కు వివాదం జరిగింది. బాలుడు తన స్నేహితులకు చెప్పడంతో వారు వచ్చి ఆటో డ్రైవరు, అతనితో పాటు ఉన్న కూలీపై దాడి చేశారు. ఈ ఘటనలో వీరిద్దరితో పాటు అడ్డుకునే ప్రయత్నంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కు గాయాలయ్యాయి. గంజాయి మత్తులో యువకుల వీరంగం అంటూ కొందరు టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేయడంతో స్వల్ప ఘటన చర్చనీయాంశంగా మారింది.

ఓటరు జాబితా సవరణ సమగ్రతకు సహకరించాలి

- అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు వెల్లడించొచ్చు
- రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశంలో అధికారుల సూచన



సమావేశంలో తహసీల్దార్ రవిబాబు, కమిషనర్ జస్వంతరావు

తెనాలి: ఓటరు జాబితా సవరణ కోసం సంబంధిత అధికారులు ఇంటింటి సర్వేను చేస్తున్నట్టు తెనాలి మండల తహసీల్దార్ కె.రవిబాబు చెప్పారు. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాల్సిందిగా సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుతో కలిసి తహసీల్దార్ రవిబాబు మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జులై 23న ఆరంభమైన సమగ్ర ఓటరు సర్వే, ఆగస్టు 21వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లు ప్రతి ఇంటికి సందర్శించి ఓటర్ల పరిశీలన చేస్తారని తెలిపారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా ఉండేలా ఉండేలా రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ)లను ఏర్పాటు చేసుకోవచ్చని గుర్తుచేశారు. ఇప్పటికీ బీఎల్‌ఏలను నియమించుకోని పార్టీలు కూడా తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి చనిపోయినవారి పేర్లు, వేర్వేరు చోట్ల ఓటుహక్కు కలిగివుండడం, నకిలీ ఓట్లు వంటి వాటిని గుర్తిస్తారని తెలిపారు. వీరితోపాటు బీఎల్‌ఏలు సర్వేలో పాల్గొనవచ్చని చెప్పారు. కొత్తగా వయోజనులైన వారికి ఓటు హక్కు పొందే అవకాశం ఉందన్నారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లను, నకిలీ ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని చెప్పారు. ఓటరు జాబితా సవరణలోని నిబంధనలు, ఇతర అంశాలపై ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబంలోని సభ్యులకు వేర్వేరుచోట్ల ఓటుహక్కు ఉండడాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీరందరి ఓట్లు ఒకేచోట ఉండేలా చూడాలని విజ్ఞప్తిచేయగా, అలాంటివారి వివరాలను ఒకే డోర్‌నంబరులో పేర్కొంటూ ఫారం–8లో ఇప్పించాలని తహసీల్దార్ సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ జాన్‌పాల్

తెనాలిరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్ మంగళవారం విలేకర్లతో మట్లాడారు. శాంతిని కోరుకునే క్రైస్తవులపై దాడులను కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. దేశంలో శాంతి నెలకొనాలని కోరుతూ బుధవారం ఉదయం 9 గంటలకు చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. తెనాలి, పరిసర ప్రాంత పాస్టర్లు, క్రైస్తవులు, క్రైస్తవ నాయకులు, ప్రాజాస్వామ్యవాదులు, ముస్లింలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట అసోసియేషన్ నాయకులు బిషప్ కె. సుధీర్‌కుమార్, రెవ ఎ. భానుప్రసాద్, బిషప్ ఎస్. ఇమ్మానియేల్ దాస్, బిషప్ పాముల పరంజ్యోతి, రెవ సర్వోన్నతరావు, పాస్టర్ పి. డేవిడ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలోనే తలమానికంగా ఎంసీహెచ్ వార్డు



జింఖానా కార్యదర్శి డాక్టర్ పట్టాభిరామన్‌తో కలిసి పనులు పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ సహకారంతో గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింఖానా పేరుతో సుమారు రూ.80 కోట్లతో నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏపీలోనే తలమానికంగా నిలుస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జింఖానా కార్యదర్శి, 1983 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ సామినేని పట్టాభిరామన్ ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఎంసీహెచ్ వార్డు రెండు ఫ్లోర్లు పూర్తి కావచ్చాయని, మరో నాలుగు ఫ్లోర్ల నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామన్నారు. డాక్టర్ పట్టాభిరామన్ మాట్లాడుతూ ఎంసీహెచ్ వార్డు నిర్మాణాన్ని వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అనేక మంది పూర్వ విద్యార్థులు ఎంసీహెచ్ నిర్మాణం కోసం విరివిగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. శరవేగంగా నిర్మాణ పనులు సాగడం సంతోషంగా ఉందన్నారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందనాయక్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యార్థి అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ

- పాఠశాలకు వెళ్లి విచారించిన డీఈఓ శైలజ
- బాధ్యులైన హెచ్ఎం, పీఈటీ సస్పెన్షన్



జీజీహెచ్ క్యాజువాల్టీలో విద్యార్థి లాల్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న డీఈఓ శైలజ

గుంటూరుఎడ్యుకేషన్: కాలం చెల్లిన ఐరన్ ట్యాబ్లెట్లు మింగి తీవ్ర అనారోగ్యానికి గురైన విద్యార్థి లాల్ అహ్మద్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పరామర్శించారు. అదే సమయంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి విద్యార్థికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి లాల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, జీజీహెచ్‌లో మె రుగైన వైద్యం అందిస్తున్నారని డీఈఓ శైలజ చెప్పారు.

పాఠశాలకు వెళ్లి విచారణ..

డీఈఓ శైలజ ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. ఏఎన్ఎంలు ఇచ్చిన ట్యాబ్లెట్లను పరీక్షించకుండా నేరుగా విద్యార్థులకు పంపిణీ చేసిన సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని ప్రశ్నించారు. విద్యార్థి తండ్రి అబ్దుల్ హనీఫ్‌తో మాట్లాడారు. డీఈఓ వెంట డీవైఈఓ వి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

హెచ్ఎం, పీఈటీ సస్పెన్షన్

సంఘటనకు బాధ్యులను చేస్తూ కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డితో పాటు పీఈటీ శిరీషారాణిని సస్పెండ్ చేశారు.

వేంకటేశ్వ స్వామికి ప్రత్యేక పూజలు

పాతగుంటూరు: లాలాపేటలోని పద్మావతి అండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మంగళవారం గుంటూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.రాజగోపాలరావు సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో జిల్లా జడ్జికి స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జిని సత్కరించి ప్రసాదం అందజేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, అర్చకులు మురళీచంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.